క్లుప్తంగా

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు..(కిలోల్లో)

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 32, పందిరిబీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 23, దొండ 23, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 25, దోసకాయ 28, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 21, చామగడ్డ 70, మొరంగడ్డ 28, కందగడ్డ 31, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5.

నేడు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యటన

సనత్‌నగర్: నియోజకవర్గంలోని సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శనివారం పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు అమీర్‌పేట డివిజన్‌లోని ఎస్‌ఆర్‌నగర్ దేవేందర్‌రెడ్డి ఆస్పత్రి ప్రాంతంలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకోనున్నారు. అనంతరం సనత్‌నగర్ డివిజన్‌లోని ఎల్‌ఐజీహెచ్ క్వార్టర్స్‌లో గల పార్కు ప్రాంతంలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుంటారు. లోధా అపార్ట్‌మెంట్ వద్ద, జెక్‌కాలనీ ఒకటో వీధిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించునన్నారు.

నేడు క్యాంపస్ డ్రైవ్..

సనత్‌నగర్: దిశ సంస్థ ఆధ్వర్యంలో ఎర్రగడ్డ మోతీనగర్‌లోని డాన్‌బాస్కో డిగ్రీ కళాశాలలో శనివారం క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఐవన్‌వాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ (పాస్/ఫెయిల్) విద్యార్థులకు సాఫ్ట్‌వేర్, బీపీఓ, బ్యాంక్ ఎగ్జిక్యూటివ్స్, ప్లేస్‌మెంట్ కో–ఆర్డినేటర్ ఉద్యోగ నియామకాలు జరపనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్యాంపస్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. వివరాలకు 94905 17219, 77025 49490 ఫోన్‌నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

వంజరి భవన్ భూమి పూజ ఆహ్వాన పత్రం ఆవిష్కరణ

లాలాపేట: తెలంగాణ వంజరి సంఘం ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయత్‌లో నిర్మించతలపెట్టిన వంజరి భవన్ భూమి పూజ కార్యక్రమాన్ని వచ్చే నెల ఫిబ్రవరి 4న నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరెందర్‌లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తార్నాకలోని వంజరి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు.

నూతన కేలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: వైకల్యం అనేది కేవలం శరీరానికి మాత్రమే సంబంధించినదని మానసిక సామర్థ్యానికి ఏ మాత్రం సంబంధం ఉండదని యూనియన్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ సురేష్ చంద్ర తెల్లి అభిప్రాయపడ్డారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని బ్యాంకు ఆవరణలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 2023 నూతన క్యాలెండర్‌ను చీఫ్ మేనేజర్ హెచ్‌ఆర్ విజయ్ కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు.

పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని వీక్షించిన విద్యార్థులు



లాలాపేట: దేశ ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం నిర్వహించిన పరీక్ష పే చర్చా–2023 లైవ్ కార్యక్రమాన్ని లాలాపేటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు వీక్షించారు. దీనికి కోసం పాఠశాలలో ప్రత్యేకంగా టీవీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడిని జయించేందుకు చెప్పిన చిట్కాలను ఆసక్తిగా విన్నారు.

టెల్లూరిస్ బయోటెక్‌కు 'బయో కెమికల్ వర్గీకరణ'

బంజారాహిల్స్: రైతులు, సాగుదారులకు పంటల రక్షణ పరికరాల తయారీ, సరఫరాలో నిమగ్నమైన ఉన్న హైదరాబాద్‌కు చెంది టెల్లూరిస్ బయోటెక్ యునైటెడ్ స్టేట్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ నుంచి బయో కెమికల్ వర్గీకరణను పొందిందని సంస్థ వ్యవస్థాపకుడు వేణు పోలినేని తెలిపారు. అలెజాండ్రోతో కలిసి శుక్రవారం ఆయన బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణ అనేది బయోపెస్టిసైడ్స్‌గా నమోదు చేయడానికి సాంకేతిక మూల్యాంకనంలో మొదటి, అతి ముఖ్యమైన దశ అన్నారు. ఉత్పత్తి చేసిన పంట దిగుబడి, నాణ్యతకు అంతరాయం కలగకుండా రసాయనాల వాడకాన్ని అనుకూలపర్చడం దీని ఉద్దేశమన్నారు.

ఓయూలో కామర్స్ మీట్-2023 ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అఖిల భారత కామర్స్ పీజీ విద్యార్థుల మీట్–2023 కార్యక్రమం ప్రారంభమైంది. శుక్రవారం కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాములు అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రి, ఓయూ వీసీ ప్రొ.రవిందర్ ముఖ్య, గౌరవ అతిథులు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కామర్స్ మీట్–2023 ప్రారంభించి మాట్లాడారు. రెండు రోజులు జరిగే కార్యక్రమంలో వాణిజ్యశాస్త్రానికి సంబంధించిన వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేస్తామని, తెలంగాణ వ్యాప్తంగా 400 మంది కామర్స్ పీజీ విద్యార్థుల హాజరుకానున్నట్లు కామర్స్ విభాగం హెడ్, కామర్స్ మీట్–2023 ఛైర్మన్ ప్రొ.చెన్నప్ప, కన్వీనర్ ప్రొ.నరేష్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో కామర్స్ బీవోఎస్ ప్రొ.అప్పారావు, డీన్ ప్రొ.గంగాధర్, చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్‌రావు, ప్రొ.దిప్లా తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.

జెక్‌కాలనీ గాంధీజీ విగ్రహం వద్ద షెల్టర్ ప్రారంభం


షెల్టర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు జి.సూర్యశంకర్‌రెడ్డి

సనత్‌నగర్: జెక్‌కాలనీ గాంధీ విగ్రహ రక్షణ కోసం సుందరంగా ఏర్పాటుచేసిన షెల్టర్‌ను సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ప్రారంభించారు. అసెంబ్లీలో ప్రాంగణంలో ధ్యానముద్రలో ఉండే విగ్రహం మాదిరిగా ఉన్న ఇక్కడి విగ్రహం ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పాడైపోతుంది. స్పందించిన గ్రీన్‌సిటీ అధినేత కొండ్రజు సుబ్బరాజు తన సొంత ఖర్చులతో గాంధీజీ విగ్రహానికి ఆకర్షణీయంగా షెల్టర్ డిజైన్ చేయించి ఏర్పాటుచేశారు. అలాగే గాంధీజీ విగ్రహం దిమ్మె పైకి ఎక్కేందుకు వీలుగా ఇనుప నిచ్చెనను కూడా ఏర్పాటుచేయించారు. ఈ సందర్భంగా సుబ్బరాజును కొలను లక్ష్మీబాల్‌రెడ్డితో పాటు జెక్‌కాలనీ అధ్యక్షుడు జి.సూర్యశంకర్‌రెడ్డి, అనంతరెడ్డి, సురేష్‌గౌడ్, శివారెడ్డి, నాగిరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ వైవీ రాఘవయ్య, శ్రీహరి, రేణుమాను బాషాలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆసుపత్రిలో ఆక్సిజన్ తయారీ యూనిట్లు నెలకొల్పాలి


ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రారంభించిన వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకట్

అమీర్‌పేట: కోవిడ్ కాలంలో ఏర్పడిన ఆక్సిజన్ అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అన్ని పెద్ద, మధ్య తరహా ఆసుపత్రుల్లో ఆక్సిజన్ యూనిట్లను నెలకొల్పాలని ప్రభుత్వం సూచించిందని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్ తెలిపారు. అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ తయారీ ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. గాలి నుండి 98.2 శాతం స్వచ్ఛతతో కూడిన ఆక్సిజన్‌ను ఈ ప్లాంట్ ఉత్పత్తి చేస్తుందని, దీని ద్వారా లభించే ఆక్సిజన్ ఆసుపత్రి అవసరాలను పూర్తిగా తీరుస్తుందన్నారు. మెడికల్ సర్వీసెస్ హెడ్ ఉమా శ్రీదేవి, చంద్రశేఖర్, ప్రవీణ్ పాటిల్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగోలీ విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు అందజేస్తున్న ముప్పిడి మధుకర్, పనస సంతోష్

కంటోన్మెంట్: అంబేద్కర్ సేవా సంఘం లక్ష్మీ నగర్ అభివృద్ధితో పాటు సాంఘిక, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండటం అభినందనీయం అని బీఆర్‌ఎస్ సీనియర్ నేత ముప్పిడి మధుకర్ అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ నేత పనస సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి రంగోలీ పోటీల బహుమతుల ప్రధానోత్సవాన్ని శుక్రవారం లక్ష్మీనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు.

షటిల్ టోర్నమెంట్ విజేత ఎస్ఎస్ఆర్

చిలకలగూడ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అభినవ్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ నిర్వహించిన షటిల్ డబుల్స్ అవుట్‌డోర్ ఇంటర్‌జోన్ టోర్నమెంట్‌లో చిలకలగూడ నాగులూరి పార్కుకు చెందిన సికింద్రాబాద్ షటిల్ రైడర్స్‌విజేతగా నిలిచింది. 16 జట్లు పాల్గొన్న టోర్నమెంట్ ఫైనల్‌లో అభినవ్‌నగర్ యూత్ అసోషియేషన్‌కు చెందిన పాపారావు, నాగరాజులపై సికింద్రాబాద్ షటిల్ రైడర్స్‌కు చెందిన శ్రీనివాస్, రాంబాబులు 21–19 తో విజయం సాధించి టోర్నమెంట్ విజేతలుగా నిలిచారు. డాక్టర్ భట్టు, పాపారావులు బెస్ట్‌ప్లేయర్ అవార్డులు గెలుచుకున్నారు.


షటిల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం: రామకృష్ణ


భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్లోని అన్ని కాలనీలు, బస్తీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. శుక్రవారం కంటోన్మెంట్ ఒకటో వార్డు సంజీవయ్య నగర్‌లో రూ.35 లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు, బాపూజీనగర్‌లో రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం బాపూజీనగర్‌లో బోర్‌వెల్‌లో నూతన పంప్‌సెట్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో అభివృద్ధి పనుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కనీస స్థాయిలోనూ సహకారం అందించడం లేదన్నారు. అందుబాటులో ఉన్న పరిమిత నిధులతోనే పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నేతలు భానుక మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ప్రొ. జయశంకర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరం

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిఆర్‌ఎస్ నేతలు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం తార్నాక డివిజన్ పరిధిలో ప్రొ. జయశంకర్ ఇండోర్ స్టేడియంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికి కంటి వైద్యం అందుబాటులో తీసుకురావడానికి కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కావునా కంటి సమస్యలు ఉన్న వారు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సునీల్ ముదిరాజ్, నాగేశ్వర్ రావు గౌడ్, మల్లికార్జున్, నాగులు, పాల్గొన్నారు.

'ప్రజానాట్యమండలి' దిగ్భ్రాంతి

బంజారాహిల్స్: ప్రముఖ సినీ నటి జమున మృతి పట్ల ప్రజానాట్యమండలి సినిమా శాఖ అధ్యక్షుడు వందేమాతరం శ్రీనివాస్, కార్యదర్శి మద్దినేని రమేష్‌బాబు, కోశాధికారి, మా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మాదారం రవి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పుట్టిల్లు చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె అనేక సినిమాల్లో హీరోయిన్‌గా నటించి తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నారని వారు పేర్కొన్నారు. తాను ఎంతో ఎత్తుకు ఎదిగినా చివరి శ్వాస వరకు ప్రజానాట్య మండలితో అనుబంధాన్ని కొనసాగించారన్నారు. డాక్టర్ గరికపాటి రాజారావు శతజయంతి ఉత్సవాల్లో కూడా ఉత్సాహంగా పాల్గొని రాజారావు పట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్నారని అన్నారు. జమున కుటుంబ సభ్యులకు వారు తమ సానుభూతిని వ్యక్తం చేశారు.

మంత్రి తలసాని రాజశ్యామల యాగం


రాజశ్యామల యాగం నిర్వహిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: రాజశ్యామల నవరాత్రులు, వసంత పంచమి సందర్భంగా గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసంలో రాజ శ్యామల యాగాన్ని నిర్వహించారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దంపతులు యాగం నిర్వహించారు. వేలేటి సిద్ధ రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో అమ్మవారికి పూజలు జరిపారు.

అమీర్‌పేట ప్రభుత్వ స్కూల్లో పరీక్షా పే చర్చ


విజేతలకు సర్టిఫికెట్లను అందజేసిన కార్పొరేటర్ సరళ

అమీర్‌పేట: అమీర్‌పేట ప్రభుత్వ హైస్కూల్‌లో పరీక్షా పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. 9,10వ తరగతికి చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషియన్ జరిగింది.ఇందులో 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ హాజరయ్యారు.

టీసీఎస్ ఐయాన్ ఇంటెల్లిజెమ్ విజేతగా హెచ్‌పీఎస్ విద్యార్థి


విజేతగా నిలిచిన సంస్కృతి

సనత్‌నగర్: జాతీయస్థాయి అతిపెద్ద పోటీ అయిన టీసీఎస్ ఐయాన్ ఇంటెల్లిజెమ్‌లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని సంస్కృతి విజేతగా నిలిచింది. ఆరో తరగతి చదువుతున్న చిన్నారి తెలంగాణ నుంచి విజేతగా నిలిచిన ఏకైక విద్యార్థి కావడం గమనార్హం. యూనివర్సల్ వాల్యూస్ అనే అంశంపై జూనియర్స్ విభాగంలో సంస్కృతి టైటిల్‌ను కైవసం చేసుకుంది. గతంలో జరిగిన ఐదు ఎడిషన్ల పోటీలలో హెచ్‌పీఎస్ నుంచి టైటిల్ గెలవడం కూడా ఇదే ప్రథమం.టీసీఎస్ ఐయాన్ ఇంటెల్లిజెమ్ అనేది 21వ శతాబ్దపు నైపుణ్యాభివృద్ధి కోసం 5 నుంచి 9 తరగతుల విద్యార్థులకు మూడు దశల్లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీ. క్వాలిఫైయర్, ప్రీ ఫైనల్స్, గ్రాండ్ ఫినాలే దశల్లో జరిగిన ఈ పోటీలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వందలాది పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో సంస్కృతిని విజేతగా నిలవడంతో పాటు మరో మూడు విభాగాల్లో ప్రీ ఫైనల్ వరకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీసీఎస్ ఐయాన్ ఇంటెల్లిజెమ్ ఒక గొప్ప జాతీయ స్థాయి టాలెంట్ ప్లాట్‌ఫామ్‌గా పేర్కొన్నారు. దీని ద్వారా 21వ శతాబ్దపు నైపుణ్యాల గురించి అవగాహన ఏర్పరచుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, హెచ్‌పీఎస్ ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

మహిళా శ్రామికశక్తిని పెంచాలి

సనత్‌నగర్: దేశంలో మహిళల కార్మిక శక్తి భాగస్వామ్య నిష్పత్తిని పెంచే దిశగా నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని న్యూఢిల్లీలోని అశోక యూనివర్శిటీ ప్రొఫెసర్ అశ్వని దేశ్‌పాండే పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ప్రసంగాల పరంపరంలో భాగంగా శుక్రవారం అమీర్‌పేటలోని సెస్ ఆడిటోరియంలో సెస్ డైరెక్టర్ రేవతి అధ్యక్షతన జరిగిన ×ద డిమాండ్ సైడ్ స్టోరీ: స్ట్రక్చరల్ ఛేంజ్ అండ్ ది డిక్లైయిన్ ఇన్ ఫీమేల్ లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్× అంశంపై సదస్సు జరిగింది. వక్తగా హాజరైన అశ్వనిదేశ్ పాండే మాట్లాడుతూ 2011 తర్వాత మహిళా శ్రామిక సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తుందన్నారు. ఇదే విషయాన్ని పలు నివేదికలు కూడా సూచిస్తున్న నేపథ్యంలో భారతదేశం మహిళా శ్రామిక శక్తి పెంపు దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి గృహోపకరణాలు దగ్ధం

అడ్డగుట్ట: ఇంట్లో పూజ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు దీపం చేయి జారి మంటలు చెలరేగి గృహోపకరణాలు దగ్ధమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈస్ట్‌మారేడుపల్లిలోని శ్రీల అపార్ట్‌మెంట్లోని 7వ అంతస్తులో నివాసముంటున్న స్వరూప శుక్రవారం సాయంత్రం సమయంలో దేవుని గదిలో పూజ చేస్తుంది. ఈ క్రమంలో ప్రమాదశాత్తు దీపం కింద పడడంతో పక్కనే ఉన్న నూనె డబ్బాకు మంటలు అంటుకున్నాయి. మెల్లిగా మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్నటువంటి స్వరూపతో పాటు ఆమె భర్త వెంటనే బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో ఘటనా స్థలానికి వారితో పాటు స్థానిక తుకారాంగేట్ పోలీసులు చేరుకున్నారు. మూడు ఫైర్ ఇంజన్లతో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది ఫ్లాట్‌లో చెలరేగిన మంటలను అదుపు చేశారు. అదృష్టవశాత్తు ఇంట్లోని వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఇంట్లోని ఫ్రిడ్జ్, ఏసీ, మంచం, కుర్చీలు ఇతర గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి.

పీహెచ్‌డీ అర్హత మార్కులను తగ్గించండి


ఓయూ విద్యార్థి సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హత మార్కులను తగ్గించాలని విద్యార్థి నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో జరిగిన ఓయూ విద్యార్థుల రౌండ్‌టేబుల్ సమావేశంలో తెలంగాణ విద్యార్థి జేఏసీ ఛైర్మన్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, ఓయూ అధ్యాపకులు ఇటికాల పురుషోత్తం, టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొని మాట్లాడుతూ ఓయూ చదివే అత్యంత పేద విద్యార్థులకు పరిశోధన విద్యను దూరం చేయవద్దనాన్నరు. అర్హత మార్కులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈఎస్‌డబ్ల్యూ విద్యార్థులకు 15, ఓసీ విద్యార్థులకు 20 మార్కులకు తగ్గించాలని అధికారులను కోరారు. ఓయూ న్యాక్ ఎ–ప్లస్ గుర్తింపు గల వర్సిటీ అయినందున అర్హత మార్కులను తగ్గించుకోనె అవకాశం ఉందన్నారు. గతంలో పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హత మార్కులు తగ్గించారని ఈ సందర్భరంగా గుర్తు చేశారు. అర్హత మార్కులను తగ్గించకుంటే పోరాటాలు కొనసాగిస్తామని ఓయూ విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరించారు.

అజ్మీర్ దర్గాకు చాదర్..


చాదర్‌ను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: అజ్మీర్ దర్గా ఉర్సు సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో చాదర్‌ను పంపించారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాకు వెళ్ళే ముస్లిం మత పెద్దల సమక్షంలో శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 28వ తేదీన దర్గాలో చాదర్‌ను సమర్పించనున్నారు. కార్యక్రమంలో జహంగీర్, షేక్ షాబుద్దీన్, మహ్మద్ అబ్బాస్, ముఖ్రం, అబ్రార్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు


పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బీసి సంఘం నాయకులు

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరాజన్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలనీ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం బీసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆధ్వర్యంలో ఓయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రథమ పౌరురాలు, మహిళా అని కనీస గౌరవం లేకుండా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆ వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చేప్పాలనీ బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి భర్తరఫ్ చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వినోద్ యాదవ్, రమేష్ యాదవ్ తదితరులున్నారు.

'రిపబ్లిక్ డే' కప్ విజేత శివాలయం బస్తీ


విజేత జట్టుకు ప్రైజ్ మనీ అందజేస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి

కంటోన్మెంట్: 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బోయిన్‌పల్లిలోని కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన రిపబ్లిక్ డే కప్‌ను స్థానిక శివాలయం బస్తీ జట్టు కైవసం చేసుకుంది. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. శివాలయం బస్తీ జట్టు కంటోన్మెంట్ ప్లేయర్స్ జట్టుపై ఫైనల్‌లో విజయం సాధించి కప్ గెలుచుకుంది. జక్కుల మహేశ్వర్ రెడ్డి ఫైనల్‌కు చేరిన ఇరు జట్ల సభ్యులను అభినందించి కప్‌తో పాటు ప్రైజ్ మనీ అందజేశారు. విజేత జట్టుకు రూ.20వేలు, రన్నరప్ జట్టుకు రూ.10వేలు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఆరిఫ్ నిలిచారు. టోర్నమెంట్ బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా మెహ్రాజ్, బెస్ట్ బౌలర్‌లుగా సాయినిక్, విశాల్ నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో ప్రావీణ్యం సాధించడం ద్వారా అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో విశాల్, సాగర్, ఆచీ, సాయి, హసీన్, విజయ్, ఆరిఫ్, శంషాద్, ఇర్ఫాన్, రిజ్వాన్, శ్రవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్లోబల్ మ్యూజిక్ ఫెస్టివల్


మాట్లాడుతున్న వయోలిన్ విద్వాంసులు పద్మభూషణ్ డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యం

సనత్‌నగర్: మాదాపూర్‌లోని శిల్ప కళావేదికలో శనివారం సాయంత్రం 6.30 గంటలకు గ్లోబల్ మ్యూజిక్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. అంతర్జాతీయ వయోలిన్ విద్వాంసులు పద్మభూషణ్ డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యం, పద్మశ్రీ కవితా కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో ఈ సంగీత కచేరి జరగనుంది. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం శుక్రవారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో జరిగింది. ఈ సందర్భంగా ఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తన తండ్రి, ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం ఈ కచేరిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది కుమార్తె బిందు సుబ్రహ్మణ్యం, కుమారుడు అంబి సుబ్రహ్మణ్యంలతో పాటు స్పానిష్ డ్యాన్సర్ నజారె డే, ఆఫ్రికా మాలి నుంచి విచ్చేసిన అంతర్జాతీయ సింఫనీ ఆర్టిస్ట్ ఫస్సేరీ దిబాటే, ప్రముఖ కథక్ కళాకారిణి మేఘా రంజని, భరతనాట్యం కళాకారిణి నంది జయకుమార్ ప్రదర్శనలు ఉంటాయన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి హామీ


సిటీ లైబ్రరీ డిప్యూటీ ఛైర్మన్లుకు వినతిపత్రం అందిస్తున్న కార్పోరేటర్ హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పాఠకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తక్షణమే నూతన గ్రంథాలయ భవనం నిర్మాణం చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ కోరారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు ఆదేశాల మేరకు సిటీ లైబ్రరీ డిప్యూటీ ఛైర్మన్లు శ్రీధర్, ప్రసన్నలను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుతం ఉన్న మేడిబావి లైబ్రరీ భవనంలో సరైన వసతులు, సౌకర్యాలు లేవని, ముందుగా లైబ్రరీని అక్కడినుంచి మరో భవనంలోని తరలించి, నూతన లైబ్రరీ భవన నిర్మాణం చేపట్టాలని కోరగా సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు హామీ ఇచ్చారని కార్పోరేటర్ హేమ తెలిపారు.

ఓయూకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర బడ్జెట్‌లో ఓయూకు ప్రత్యేక నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీలో సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పడిన నాటి నుంచి ఓయూకు భారీగా నిధుల కోత విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల పై అధికంగా ఫీజుల భారం మోపి ఫెలోషిప్‌లను తగ్గించారని పేర్కొన్నారు.పీజీ విద్యార్థులకు రూ.3000, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.10 వేల ఫెలోషిప్ అందచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ప్రదర్శన చేట్టారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సుమంత్, స్వాతి, వెంకటేష్, ప్రశాంత్, భువన, శ్రీవాణి, సింధు, సాయి, సంపత్, శివ, దిలీఫ్, శశాంక్, శ్వేత, సోనియా, సంజన పాల్గొన్నారు.


ఆర్ట్స్ కాలేజీ ఎదుట పీడీఎస్‌యూ నాయకులు, కార్యకర్తల ప్రదర్శన